పింఛన్‌తో భరోసా



- ప్రతి నెలా 1న ఠంచన్‌గా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేత
- తూర్పులో 15,891 మంది లబ్ధిదారులు

ఆరిలోవ: పింఛన్ కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా నాలుగైదు రోజులు ఉంటే కానీ చేతికి అందేది కాదు. 2019 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితులు మారిపోయాయి. ప్రతి నెలా ఠంచన్‌గా ఒకటో



13వ వార్డులో మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీరు(ఫైల్)

జోన్-2లో వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు		
వార్డు	లబ్ధిదారులు	చెల్లిస్తున్న నిధులు(రూ.లలో)
9	974	90,35,500
10	1,534	1,36,55,500
11	2015	1,76,23,750
12	1459	1,30,36,750
13	1909	1,57,49,250

తేదీన వలంటీర్లు ఇంటికొచ్చి మరీ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకను అందిస్తున్నారు. ఇలా తూర్పు నియోజకవర్గంలో వేల మంది లబ్ధి పొందుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న 15 వార్డుల్లో అధిక సంఖ్యలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ బాధితులకు పింఛన్ అందిస్తున్నారు. గత టీడీపీ హయాంలో అరకొరగా ఇచ్చే పింఛన్ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకు రూ.3 వేలు చొప్పున అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు. నియోజకవర్గంలో 15 వార్డులు ఉండగా.. వాటిలో 5 వార్డులు జోన్-2 పరిధిలోను, మరో 10 వార్డులు జోన్-3 పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గంలో ఉన్న 15 వార్డుల్లో 15,891 మంది లబ్ధిదారులు ఉండగా.. వారికి ప్రతి నెలా వైఎస్సార్ పింఛన్ పథకం ద్వారా రూ.13.40 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నారు.



2వ వార్డులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు(ఫైల్)

జోన్-2లో 7,891 మంది లబ్ధిదారులు

తూర్పు నియోజకవర్గంలో 15,891 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో జోన్-2 పరిధిలో ఉన్న 9, 10, 11, 12, 13 వార్డుల్లో 7,891 మంది పెన్షన్ అందుకుంటున్నారు. వీరికి ప్రతి నెలా రూ.6.91 కోట్లు పింఛన్ రూపంలో చెల్లిస్తున్నారు. వీరిలో వందలాది మంది డయాలసిస్ బాధితులు కూడా పెన్షన్ అందుకుని ఊరట చెందుతున్నారు. ఇతర ప్రాంతాలలో దూరంగా ఆస్పత్రుల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు సైతం వలంటీర్లు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తుండడం గమనార్హం

ఈ నెల రూ.3 వేల పింఛన్ అందింది..



ప్రతి నెలా ఇంటికి వచ్చి వలంటీరు పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. ఈ నెల నుంచి పింఛన్ డబ్బులు మరో రూ.250 పెంచారని చెప్పి వలంటీరు రూ.3 వేలు ఇచ్చారు. చాలా ఆనందం వేసింది. ప్రతి నెలా ఈ డబ్బులు నాకు చాలా ఉపయోగపడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– రూతమ్మ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, శ్రీకాంత్‌నగర్, 13వ వార్డు

పింఛనే ఆధారం



నాకు పాక్షిక అంధత్వం ఉంది. దీంతో ఏ పనీ సరిగా చేయలేను. నా భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గతంలో దివ్యాంగుల పింఛన్ కింద నెలకు రూ.1,500 ఇచ్చేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకు రూ.3 వేలు దివ్యాంగ పెన్షన్ ఇస్తున్నారు. ఈ పింఛన్ డబ్బులు నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాయి. పింఛన్ డబ్బులు పెంచి చాలా మేలు చేశారు.

– గుడ్ల వెంకటరెడ్డి, టీబీసీ పాయింట్, 12వ వార్డు

ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తున్నారు



నాలుగున్నరేళ్లుగా గతంలో మాదిరిగా పింఛన్ కోసం ఆఫీసు వద్దకు వెళ్లి రోజుల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా పోయింది. వలంటీరే ఇంటికి వచ్చి పెన్షన్ అందిస్తున్నారు. ఈ నెల కూడా వలంటీరు మా ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు పెరిగాయంటూ రూ.3000 చేతికి ఇచ్చారు. వితంతువునైన నాకు ఈ డబ్బులు నెల ఖర్చుల కోసం ఉపయోగపడుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. మాలాంటి వారి కోసం మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలని దేవుడిని కోరుకుంటున్నా.

– వాసుపల్లి గన్నమ్మ, వితంతువు, ఆరిలోవ కాలనీ, 13వ వార్డు

క్లుప్తంగా

జేసీఐ వైజాగ్ అచీవర్స్ ప్రెసిడెంట్‌గా దిలీప్ కుమార్



సమావేశమైన నూతన కార్యవర్గ సభ్యులు

బీచ్ రోడ్డు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వైజాగ్ అచీవర్స్ నూతన అధ్యక్షుడిగా బి.దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ ప్రెసిడెంట్ సురేష్ గొంప.. దిలీప్ కుమార్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గతేడాది చేపట్టిన సామాజిక కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



మలేరియా సూపర్‌వైజర్ రత్నంను సత్కరిస్తున్న పాస్టర్లు

మద్దిలపాలెం : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించే వారికే ప్రజలు, అధికారుల్లో గుర్తింపు లభిస్తుందని రాక్ ప్రేయర్ ఫెలోషిప్ పాస్టర్ రెవరెండ్ కె.జాన్, బైబిల్ బిలీవింగ్ చర్చి అధినేత బిషప్ కిషోర్ దరోగా అన్నారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని జిల్లా మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ పి.వై.ఎస్.రత్నం ఉత్తమ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం పలు చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. అనంతరం రత్నం సేవలను వారు కొనియాడారు.

బీజేపీ సంయోజక్‌గా రామ్మోహన్

ఎంవీపీ కాలనీ: బీజేపీ విశాఖ పార్లమెంట్ సంయోజక్‌గా సరిపల్లి అచ్యుత రామ్మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామ్మోహన్ పార్టీ భీమిలి అసెంబ్లీ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్రతో పాటు నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఐఐఎంవీలో నూతన కోర్సు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(విశాఖపట్నం) ఆధ్వర్యంలో నూతనంగా ఎగ్జిక్యూటివ్ సర్టిఫికెట్ ప్రోగ్రాం ఇన్ స్ట్రాటజిక్ డిజిటల్ మార్కెటింగ్ అప్లయిడ్ అనలటిక్స్ కోర్సును ప్రారంభించారు. ఐదు నెలల కాల వ్యవధితో నిర్వహించే ఈ కోర్సులో 45 మందికిపైగా వివిధ సంస్థలు, పరిశ్రమల్లో పని చేస్తున్న ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఆన్‌లైన్ విధానంలో ఈ కోర్సును నిర్వహిస్తున్నారు. అనలిటికల్ టెక్నిక్స్ సహాయంతో డిజిటల్ మార్కెటింగ్ చేయడానికి అవసరమైన సామర్థ్యాలను పెంపొందిస్తుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఐఎంవీ సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్, అనలిటిక్స్ తదితర అంశాలు నేటి ఆధునిక సమాజంలో ఎంత ఉపయుక్తంగా నిలుస్తున్నాయో వివరించారు. కార్యక్రమం వివరాలు, కోర్సు రూపకల్పన తదితర అంశాలను ప్రోగ్రాం సహ సమన్వయకర్త ఆచార్య అమిత్ శంకర్, ప్రోగ్రాం సంచాలకుడు పంకజ్ విశ్వకర్మ తెలియజేశారు.

డీఐఈలో వస్త్ర ప్రదర్శన రేపు

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ఎడ్యుకేషన్ సెంటర్(డీఐసీ)లో బుధవారం వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నారు. దయాల్‌బాగ్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వస్త్ర ప్రదర్శన నిర్వహించి విక్రయాలు చేపట్టనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన బెడ్‌షీట్లు, చున్నీలు, ఫ్రాక్స్, టాప్స్, నైటీలు, పిల్లలు గౌనులు తదితర వాటిని ఇక్కడ ప్రదర్శనలో విక్రయాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందన్నారు.

జంతు సంపద పరిరక్షణ అందరి బాధ్యత

ఆరిలోవ: జంతు సంపదను పరిరక్షించడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకర రావు అన్నారు. ×జంతు సంక్షేమ-సామాజిక బాధ్యత×పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జంతువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకరరావు మాట్లాడుతూ జంతు సంపద మానవ మనుగడకు అవసరమన్నారు. జంతువులను వృద్ధి చేయడంతో పాటు వాటి హక్కులను కాపాడి గౌరవించాలన్నారు. వాటిపై మానవీయత ప్రదర్శించాలని సూచించారు. భూమి ఆవిర్భవించిన తర్వాత చాలా జాతుల జంతువులు రానురాను కనుమరుగవుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచి జంతువులపై ప్రేమ పెంచుకోవాలని, వాటి సంరక్షణలో బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డులో కొలువుదీరిన కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి తోడ్పడుతానని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి గాయత్రి, పార్టీ నాయకులు మధుపాడ రవికుమార్, పేర్ల విజయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రతి ఇంటా సంక్షేమం



ఇంటింటికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు



21వ వార్డులో ఇంటికి వచ్చిన ఎంపీ ఎంవీవీకి హారతి ఇస్తున్న ఓ మహిళ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర సోమవారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర సాగుతోంది. యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 29వ రోజు 19వ వార్డులో శివగణేష్ నగర్, జాలరి ఎండాడ ప్రాంతాల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులైన మహిళలు ఎంపీకి హారతు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు విద్యా, సంక్షేమం, అభివృద్ధి దిశగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి ఆయన నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతో సంక్షేమ కార్యక్రమాలు కొనసాగింపునకు ఢోకా ఉండదన్నారు.

21వ వార్డులో..

బీచ్‌రోడ్డు: ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సోమవారం జీవీఎంసీ 21వ వార్డులోని ఏయూ అవుట్ గేటు, పాండురంగాపురం, మైత్రి నగర్, రజక వీధి ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార చైర్మన్ పేర్ల విజయచంద్ర, రాజబాబు, రవికుమార్, తదితరుల పాల్గొన్నారు.

వేటూరి పాటలతో సంగీత విభావరి నేడు



సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ చాన్స్‌లర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

మద్దిలపాలెం : డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వేటూరి 88వ జయంతిని పురస్కరించుకుని సంగీత విభావరి నిర్వహించనున్నామని ఆత్రేయ స్మారక కళా పీఠం గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ మేరకు సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు వెంకోజీపాలెంలోని తన నివాసంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సంగీత విభావరి సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అందరూ ఆహ్వానితులేనన్నారు. సినీ నేపథ్య గాయని సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరించనున్నామని తెలిపారు. గాయకులు రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, లిపికా రెడ్డి వేటూరి రాసిన పాటలను ఆలపించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, బాబురాజ్, వి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రకృతిహితం ఆదివాసీల అభిమతం

- లాభాపేక్ష రహిత జీవనం వారి సొంతం
- నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య ముత్యాలనాయుడు

ఏయూ క్యాంపస్: ప్రకృతిహితం జీవనం ఆదివాసీల అభిమతమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఎం.ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ అణుభౌతిక శాస్త్ర విభాగం, వనవాసి కల్యాణ ఆశ్రమం సంయుక్తంగా నిర్వహించిన ట్రైబల్ హెరిటేజ్ ఇన్ ఈస్టర్న్ ఘాట్స్ ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ జాతుల్లో వైవిధ్యత ఉన్నప్పటికీ వారు పరస్పరం గౌరవించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. లింగ వివక్షత లేకుండా, వృద్ధులను, అనుభవజ్ఞులను గౌరవించడం వారి నుంచి నేర్చుకోవాలన్నారు. వారిలో లాభాపేక్ష అనేది ఎన్నడూ కనిపించదన్నారు. ఇన్ని మంచి లక్షణాలు కలిగిన ఆదివాసీలు మనకన్నా ఎంతో ఉన్నతులని ఆయన అభిప్రాయపడ్డారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సహజత్వం అనేది కేవలం ఆదివాసీలలోనే కనిపిస్తుందన్నారు. ఆధునికత ఎంత పెరిగినా మన సంస్కృతులను మరువరాదన్నారు. ఆదివాసీ సంస్కృతిని, వారి జీవనాన్ని తెలయజేసే ఇటువంటి సదస్సుల నిర్వహణకు వర్సిటీపరంగా సహకారం అందిస్తామన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షకులుగా ఆదివాసీలు నిలుస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో ఆదివాసీలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏయూ న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మానవతా విలువలు ఎంతో ప్రధానమని, ఇవి ఆదివాసీలు సొంతమన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే గుణం వారి నుంచి మనం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి డైరెక్టర్ డాక్టర్ పి.శివ రామకృష్ణ, డాక్టర్ పి.శంకరరావు, శ్యాంప్రసాద్, ఏయూ మాజీ వీసీ ఆచార్య కె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ కార్నర్ పనితీరు ప్రశంసనీయం



రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌తో చర్చిస్తున్న అమెరికన్ కాన్సులేట్ అధికారి అలెగ్జాండర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన అమెరికన్ కార్నర్ ఎంతో ప్రభావవంతంగా పని చేస్తోందని యూఎస్ కాన్సులేట్(హైదరాబాద్) పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ తెలిపారు. సోమవారం ఆయన ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. అనంతరం ఏయూ రిజిస్ట్రార్, అమెరికన్ కార్నర్ మెంటార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. విశాఖలో జరిగే మిలాన్ కార్యక్రమంలో అమెరికా దేశ నౌకలు పాల్గొంటాయని, దీనిలో భాగంగా 400 మంది వరకు సెయిలర్స్ విశాఖకు వస్తారని అలెగ్జాండర్ తెలిపారు. వారు ఏయూను సందర్శించాలని ఆసక్తి చూపుతున్నారని, వారి పర్యటనకు అనుగుణంగా విద్యార్థులతో అనుసంధానం చేస్తూ విభిన్న కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. దీనికి సంబంధించి వచ్చే నెలలో తాము సమగ్ర ప్రణాళికతో వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్(హైదరాబాద్) మిలిస్సా నందుల, అమెరికన్ కాన్సులేట్ అధికారి జో క్రిష్టోఫర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూక్యాంపస్: నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం జీవీఎంసీ 20వ వార్డు పరిధి కొయ్య వీధి చిన్న వాల్తేర్ వద్ద రూ.17.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. గతంలో లేని విధంగా విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ దేవి, సచివాలయ కార్యదర్శి అశ్విని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పార్టీ నాయకుడు మువ్వల సురేష్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చంద్ర, పార్టీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, చొక్కర శేఖర్‌రావు, కన్వీనర్లు చంద్రన తిలక్, గుంటుబోయిన నరేష్, రాయల పాపారావు, పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం



జలజాక్షికి సంగీత కళాభారతి పురస్కారం ప్రదానం చేస్తున్న త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం : స్థానిక కళాభారతిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున గాత్ర విద్వాంసురాలు ముట్నూరి జలజాక్షిని డాక్టర్ నైవేలి సంతాన గోపాలం చేతుల మీదుగా సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించారు. అనంతరం బృంద సంగీత కచేరీ అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, గుమ్మలూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ఓపెన్ కరాటే పోటీలు



కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

సీతమ్మధార: నిజి కాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధినేత నాయుడు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

కరాటే హబ్‌గా విశాఖ..

ఎన్ఎస్ఎస్‌కేఏఐ చైర్మన్, సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ కరాటే ద్వారానే తాను సినీ రంగానికి వచ్చానని చెప్పారు. అయోధ్యలో శ్రీరామదాసు చిత్రంలోని తన సన్నివేశాలను ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ కరాటే హబ్‌గా ఉండడం హర్షణీయమని, కరాటే మాస్టార్లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కరాటే అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. క్రీడాకారులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. అనంతరం చాంపియన్‌షిప్ ట్రోఫీలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోటీ కార్యనిర్వాహక చైర్మన్ దాడి రత్నాకర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, ఎస్‌జీ గ్రూప్ అధినేత కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక సమస్యగా మూఢ నమ్మకాలు'



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ జాతీయ సమన్వయకర్త చారువాక

మద్దిలపాలెం : మూఢ నమ్మకాలను సామాజిక సమస్యగా ప్రభుత్వాలు గుర్తించాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చారువాక అన్నారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో నిత్య జీవితంలో మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన తరుణంలో గ్రామీణ ప్రాంతాలలో ఇంకా మూఢ నమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని పారద్రోలాలన్నారు. అనంతరం ఎస్ఎస్ఎఫ్ నాయకుడు యు.నరేష్ ఇంద్రజాల ప్రదర్శన ద్వారా మూఢ నమ్మకాలను నమ్మవద్దంటూ అవగాహన కల్పించారు.

CPC or 20 R.5 ప్రకారం నోటీసు

మహారాజశ్రీ చోడవరం IXth Additional District and Sessions Judge కోర్టులో

A.S. 86/2019

Between
పల్లేల వరహాలురావు ... అప్పీలెంటు
And
1.మైచర్ల ఆదినాయుడు
2. మెదర్తి శైలజ ... రెస్పాండెంట్లు
To,
R2: మెదర్తి శైలజ, W/o ఫణేంద్ర, 58 సం॥, హిందూ, గృహిణి, R/o. D.No. 50-1-54/28, ఫ్లాట్ నెం. 305, ASR నగర్, విశాఖపట్నం.

అమవారికి తెలియజేయడమేమనగా పై నెంబరు అప్పీలులో మీరు 2వ రెస్పాండెంటు అయి వున్నారు. పై నెంబరు అప్పీలు 9వ అదనపు జిల్లా కోర్టు చోడవరం, అనకాపల్లి జిల్లా ఏపీలో పై తెలిపిన అప్పీలెంటు మీపై దాఖలు చేయగా సదరు అప్పీలు తే.05-02-2024 దికి పై కోర్టులో వాయిదా అయివున్నది అని కాగా సదరు తేదిని మీరు సదరు కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణ తెలియపరచవలసియున్నది. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు అప్పీలు మీ పరోక్షమున తీర్మానించడమగును అని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది. 05-02-2024

చోడవరం
తేది. 29-01-2024

శ్రీ బి.వి.వి.జగన్నాథరావు
పిటీషనరు తరపు అడ్వకేటు
చోడవరం